నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 21 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జై జంగు.. జై లింగు.. దీక్ష స్వీకరించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

దీక్ష స్వీకరించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, దీక్షా పరులు

జైనూర్, జనవరి 20 : మండలంలోని జంగు దీక్ష భూమిలో గురువు కుమ్ర భగవంతరావు చేతుల మీదుగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జై జంగు.. జై లింగు దీక్ష స్వీకరించారు. 11 రోజుల పాటు దీక్ష స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ జంగుబాయి దీక్షలు చేపట్టడం వల్ల ఆమె ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో దీక్ష భూమి వ్యవస్థాపకుడు భగవంతురావు, జై జంగు.. జై లింగు ఘన్ సంస్థాన్ గౌరవాధ్యక్షుడు జర్జీవన్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో బొమ్మలకొలువు

ఎస్టీపీపీలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జైపూర్, జనవరి 20 : జైపూర్‌లోని ఎస్టీపీపీలో లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బొమ్మల కొలువు కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ సతీమణి హరిణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు ప్రజలు సంప్రదాయంగా నిర్వహించుకునే బొమ్మల కొలువు కార్యక్రమాన్ని ఈ తరం వారికి గుర్తుండేలా జరిపించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత, ఈడీ సతీమణి వెంకటలక్ష్మి, జీఎం సీసీఎస్ సతీమణి సుమిద, క్లబ్ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రమాదకర ఫ్లెక్సీలు తొలగించాలి

● బీఆర్ఎస్ నాయకుల డిమాండ్ ● మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రి, జనవరి 20 : పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన, కూడళ్లలో రాజకీయ పార్టీలు, వ్యాపారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నిలి గొండ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ స్థానిక పాత బస్టాండ్, జయశంకర్ చౌరస్తాలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైన, మూల మలుపుల వద్ద, కోల్‌బెల్ట్ రహదారి వద్ద, ఆర్వోబీ వంతెన, సింగరేణి గ్రీన్ పార్క్ వద్ద ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. చివరకు మినీ ట్యాంకు బండ్ అందాలు కనిపించకుండా చేశారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల మున్సిపాలిటీ ఆదాయానికి కూడా గండి పడుతోందని చెప్పారు. ఈ విషయమై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, ఎండీ.అబ్బాస్, బండారు సూరిబాబు, బోరిగం వెంకటేశ్, భూపెల్లి కనకయ్య, వేల్పుల కిరణ్, బర్ల సదానందం, ముస్తఫా, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, పల్లె నర్సింగ్, పూసాల ఓదెలు, బెల్లం అశోక్, అఖిలేశ్‌పాండే, శేఖర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి సీపెల్లి సాగర్ పాల్గొన్నారు.

● నిధులున్నా నిర్లక్ష్యమేనా..!
పాకలో పాఠం చెబుతున్న టీచర్

పాకలో చదువులు గిరిబిడ్డల పాట్లు

- గుడిసెలోనే కొనసాగుతున్న తరగతులు
- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- స్థలం దానం చేసినా నిర్లిప్తతలేరంటున్న పటేల్

నాలుగు వరుసల హైవేలో పోయిన గిరిజన సంక్షేమ పాఠశాల భవనం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ఆదివాసీ బిడ్డల విద్యాభ్యాసానికి పూరి పాకే దిక్కయ్యింది. నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో పక్కా భవనం కోల్పోగా పిల్లలు కనీస వసతులు లేక అవస్థలు పడాల్సి వస్తున్నది. వాంకిడి మండలం చిన్ను పటేల్ గూడలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి మూడో తరగతి వరకు ఉండగా, దాదాపు 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం నాలుగు వరుసల హైవే నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో ఈ పాఠశాల పక్కా భవనం పోయింది. అదే సమయంలో భవన నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ. 23.70 లక్షలు మంజూరయ్యాయి. కానీ భవనం నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో కొంతకాలం సమయం వృథా చేశారు. దీంతో అదే గ్రామానికి చెందిన ముకుంద్‌రావు పటేల్ స్థలాన్ని దానం చేశాడు. కానీ, అధికారులు మాత్రం భవనం నిర్మించేందుకు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో విద్యార్థులు చదువుకునేందుకు నిలువ నీడలేక అవస్థలు పడాల్సి వస్తున్నది. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవిని వివరణ కోరగా పాఠశాల భవన నిర్మాణానికి నిధులు వచ్చాయని, త్వరలోనే భవన నిర్మాణం చేపడుతామన్నారు.

పిల్లలు తిప్పల పడుతున్నరు

మా విద్యార్థులు చదువుకునే పాఠశాల హైవే నిర్మాణంలో పోయింది. భవన నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా రూ. 23.70 లక్షలు మంజూరైనయి. భవన నిర్మాణానికి స్థలం లేదని కొంతకాలం సమయం వృథా చేసిన్రు. నా సొంత స్థలం ఇచ్చి కూడా చాలా కాలమైంది. ఇప్పటి దాకా పాఠశాల భవనం నిర్మించింది లేదు. ఓ ఇంటి ముందున్న గుడిసెలో విద్యార్థులు చదువుకోవాల్సి వస్తున్నది. పిల్లలంతా మస్తు తిప్పలపడుతున్నరు. ఇకనైనా భవనం నిర్మించాలి.

- ముకుంద్‌రావ్, పాఠశాలకు స్థలం దానం చేసిన గ్రామ పటేల్

విద్యార్థికి ఆర్ఎస్పీ పరామర్శ

కౌటాల: భాస్కర్ రెడ్డితో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్

కౌటాల, జనవరి 20 : సిర్పూర్(టీ) మండలం డోర్‌పల్లి కొమ్ముగూడకు చెందిన విద్యార్థి జైసన్ అనారోగ్యంతో బాధపడుతుండగా, సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అతడి ఇంటికెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం తనవంతు సాయమందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో భూ సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వుయ్యూరి భాస్కర్ రెడ్డిని కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇటీవల ఎన్నికైన మాలీ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లెండుగురే శ్యాంరావు, ఆదె వసంత్ రావు, వాసు, నికాడే గంగారాంను ఘనంగా సన్మానించారు.

రేగులగూడను సందర్శించిన ఆర్ఎస్పీ

కాగజ్‌నగర్ రూరల్, జనవరి 20 : రేగులగూడ గ్రామాన్ని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు.

బెనిఫిట్స్ చెల్లించాల్సిందే

● శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికుల డిమాండ్
● ప్రధాన గేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష

మంచిర్యాలటౌన్, జనవరి 20 : తమకు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాల్సిందేనని మంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని కంపెనీ గేట్ ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పవర్ ప్లాంట్ మూసివేసి 26 నెలలు గడుస్తున్నా బెనిఫిట్స్‌ను యాజమాన్యం చెల్లించడం లేదని, ఈ సమస్య పరిష్కరించే వరకూ కంపెనీకి సంబంధించిన భూములను ఎవరూ కొనవద్దని రియల్ ఎస్టేట్ వ్యాపారులను కోరారు. ఈ నెలాఖరుకల్లా యాజమాన్యం దిగిరాకుంటే కంపెనీకి సంబంధించిన భూముల్లో గుడిసెలు వేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజుల సత్యం, ఉపాధ్యక్షుడు సగ్గర్తి ఆనందరావు, కోశాధికారి పెంట సత్యం, వూడెం రవిశంకర్, ఆసరి రాజయ్య, సిరిపురం తిరుపతి, కాయితి బుచ్చయ్య, మానెం శ్రీశైలం, అరికిల్ల శ్రీనివాస్, మైదం సత్యనారాయణ, గెల్లు ఎల్లయ్య పాల్గొన్నారు.

పవర్ ప్లాంటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

విద్యుత్ ఆర్టిజన్ల రిలే దీక్షలు ప్రారంభం

మంచిర్యాలటౌన్, జనవరి 20 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ల కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఆర్టిజన్ల రిలే దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ముందు, పాత మంచిర్యాలలోని ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఆర్టిజన్లకు వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని, విద్యార్హతలను బట్టి జేఎల్ఎం, సబ్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇవ్వాలని, ఒకే సంస్థలో ఒకే రూల్స్ వర్తింపజేయాలని, ఆర్టిజన్ల స్టాండింగ్ ఆర్డర్‌లను రద్దుచేసి ఏపీఎస్ఈబీ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ రెండు చోట్ల చేపట్టిన రిలే దీక్షలకు టీఈఈ 1104 యూనియన్, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం, పవర్ ఇంజినీర్ల సంఘం, డిప్లొమా ఇంజినీర్ల సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో టీపీఏసీ జేఏసీ చైర్మన్ తిరుపతి, కన్వీనర్ తోట నగేశ్, తదితరులు పాల్గొన్నారు .

పవర్ ప్లాంటు ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జీవో 60 ప్రకారం వేతనాలివ్వాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 20 : జీవో-60 ప్రకారం వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆసిఫాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పాటు చేసి 11 నెలలు అవుతున్నా ఇప్పటికీ కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఆందోళన చేపట్టగా, కమిషనర్ భుజంగ్‌రావు వచ్చి వారితో మాట్లాడారు. నెల రోజుల్లో 144 మంది కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వగా, ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్ల రాజు సమ్మయ్య, శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టికానంద్ దుర్గ ప్రసాద్, నాయకులు, కార్మికులు ప్రభాకర్,లక్ష్మి, సంధ్య, పెంటూ బాయ్, పద్మ, బాలేశ్, ప్రభాకర్, జగదీష్, నరేశ్, దుర్గయ్య,శంకర్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

● రామగుండం సీపీ శ్రీనివాస్
● కాళేశ్వరం జోన్ స్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

మంచిర్యాల అర్బన్, జనవరి 20 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఎంత ప్రతిభ కనబరిచారనేదే ముఖ్యమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అధికారులతో కలిసి తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీల ఎంపిక కోసం కాళేశ్వరం జోన్ స్థాయి లాంగ్ టెన్నిస్ పోటీలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాళేశ్వరం జోన్‌కు అత్యధిక పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్, ఫిజికల్ డైరెక్టర్స్ శ్రీనివాస్, విజయ్ కుమార్, జోన్ పరిధిలోని లాంగ్ టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ శ్రీనివాస్

కార్పొరేషన్ వద్దే వద్దు

● నర్సింగాపూర్ గ్రామస్తుల డిమాండ్ ● ధర్నా.. అడ్డుకున్న పోలీసులు ● మూడు గంటల పాటు నిరసన
● అధికారుల హామీతో ఆందోళన విరమణ

రహదారి పక్కన ధర్నా చేస్తున్న నర్సింగాపూర్ గ్రామ ప్రజలు

హాజీపూర్, జనవరి 20 : 'మా గ్రామ పంచాయతే మాకు మద్దు.. కార్పొరేషన్‌లో కలపడం వద్దే వద్దు..' అంటూ మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఇటీవల మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్ చేస్తూ నర్సింగాపూర్ గ్రామాన్ని విలీనం చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు స్థానిక రహదారి-63 వద్దకు రాస్తారోకో చేసేందుకు వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు రాస్తారోకో, ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు ససేమిరా అంటూ రాస్తారోకో, ధర్నాకు దిగుతుండగా.. కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో వారు జాతీయ రహదారిపైకి రాకుండా రోడ్డు పక్కన ధర్నాకు దిగారు. టెంట్, వంట సామగ్రిని తెప్పించుకొని న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఉంటామని భీష్మించుకుకూర్చున్నారు. కలెక్టర్ రావాలి.. న్యాయం.. చేయాలంటూ నినాదాలు చేస్తూ మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. తహశీల్దార్, ఏసీపీలు కలగజేసుకొని సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. గ్రామస్తులు మాట్లాడుతూ నర్సింగాపూర్‌లో 2500 జనాభా ఉండగా, అందులో 1300 మంది ఓటర్లున్నారని, ఇందులో 70 శాతం మంది రైతులు, కూలీలు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నారని, ఉపాధి హామీ పథకంలో ఏడాది పాటు వంద రోజుల పని దొరుకుతుందని తెలిపారు. కార్పొరేషన్‌లో విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోయి పస్తు లండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దీన్ని ఖండించక పోవడంపై గ్రామస్తులు మండి పడుతున్నారు. నాయకులు అమ్ముడు పోయారని దుమ్మెత్తిపోస్తున్నారు. రెండు రోజుల్లో న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

నస్పూర్, జనవరి 20 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టల్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లల్లో పనిచేస్తున్న వాచ్‌మెన్, కామాటి, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, స్కావెంజర్ వర్కర్లకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా 10వ తేదీలోపు వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, సంపత్, వినీత్, రాజన్న, సదానందం, ప్రశాంత్, రాజేశ్వరి, సునీత, లక్ష్మి, అనసూయ, హేమ, ప్రమీల, అనిత, లత, రాజేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, హాస్టల్ వర్కర్లు